# తిం.బు. వెడ్స్ తం.బు.

నిర్మల నిరంజన్ గారి ఏకైక సంతానం. నిరంజన్ యాభై ఎకరాల భూస్వామి. నిర్మల ఆయన గారాలపట్టి. పల్లెటూరు కావడంతో మామూలుగా ఆడపిల్లలాడుకునే తొక్కుడు బిళ్ళ, తాడాట వగైరా ఆటలతో ఆమె జీవితం హాయిగా గడిచిపోతోంది.

చదువులో పెడదామని తల్లిదండ్రులు చేసిన ప్రయత్నం ఫలించలేదు.

చద్దన్నం, అందులోనూ తరవాణీ అంటే నిర్మలకి చాలా ఇష్టం.! ఎప్పుడూ ఆటల పైనేదృష్టి, తాడాట అంటే తగని మక్కువ.

చదువు విషయానికొస్తే తెలుగులోని మొదటి రెండక్షరాలు 'అ, ఆ'లో ఒకటే వచ్చింది.

నిర్మలకి కనీసం రెండో అక్షరమైన 'ఆ' అయినా నేర్పుదామని నిరంజన్‌గారు చాలా ప్రయత్నం చేశారు గానీ రాలేదు.

నిర్మల మామ్మగారు "పోన్లేరా! అమ్మాయి మొహంలో లక్ష్మీకళ వుంది. లక్ష్మీ సరస్వతులకి పడదు. అంచేతనే సరస్వతి అబ్బటం లేదు. నీకా ఒక్కగానొక్క కూతురు. యాభై ఎకరాల మాగాణీ వుంది. దానికి చదువు లేకపోయినా ఫర్వాలేదు!" అనేది.

నిర్మల పేరుకు మాత్రమే నిర్మల. ఎప్పుడూ నిర్మలంగా ఉండదు. తెల్లవారితే తాడాట ఆడెయ్యడమే.

తాను రోజూ ఆడుకునే తాడు కనకపడకపోతే నిర్మల మనస్సు పున్నమినాటి సముద్రంలా ఘోషించేది.

ఇంట్లో పనివాళ్ళు ఆ తాడు వెతికి వెతికి తెచ్చిచ్చేవారు. ఆ ఊళ్ళో ఆడపిల్లలంతా మాములు పరికిణీలతో తాడాట ఆడితే,నిర్మల పట్టు పరికిణీతో ఆడేది. ఇడ్లీలు అవీ తినేది కాదు. చద్దన్నం తింటే సూర్యుడు నడినెత్తి మీదకి వచ్చేవరకూ తాడాట ఆడొచ్చనేది నిర్మల నమ్మకం.!

ఆ ఊళ్ళో అందరూ నిర్మలని 'తాడాట తాటకి' అనే వారు. తానాడుకునే తాడు కనపడకపోతే పక్కింట్లో వాళ్ళ బట్టలారేసుకున్న తాడు పుటుక్కుమని తెంపుకొచ్చేది.

"ఎంతలావు తాడైనా ఇట్టే తెంపేస్తుంది. దీంది రాక్షస బలం" అనుకునేవారు ఆ ఊరు వారు.

అలా తాడాట ఆడుకుంటూ, ఆడుకుంటూ ఉండగా నిర్మలకి పెళ్ళీడు వచ్చేసింది.

ఆ యాభై ఎకరాలపై మోజుతో, "మేం చేసుకుంటాం, అంటే మేం చేసుకుంటాం"

అంటూ-చాలా సంబంధాలు వచ్చాయి.

నిరంజన్‌గారికి మాత్రం ఆ ఊరిమనసబు గారి మూడో అబ్బాయికి నిర్మలనిచ్చి చేస్తే బాగుండునని అనిపించేది. ఇదే విషయం మున్సబుగారి చెవిన వేశాడు.

వాడు మాత్రం ఆ 'తిం.బు'ని చేసుకోనుగాక చేసుకోనన్నాడు. మానేస్తే మానేయి గాని మధ్యలో ఈ తిం.బు ఏమిటని అడిగారు మున్సబు.

ఓ ఆదా! తిం.బు అంటే 'తింగరి బుచ్చి'. మన ఊళ్ళో మగపిల్లలమంతా ఆ పిల్లని 'తింగరిబుచ్చ'నే పిలుస్తాం! అన్నాడు వాడు.

తప్పు! ఈ విషయం నిరంజన్‌గారికి తెలిస్తే చంపేస్తాడు అని మందలించారు మున్సబుగారు.

తన కొడుకు నిర్మల విషయంలో సుముఖంగా లేడన్న విషయం నిరంజన్‌గారికి చెప్పేశాడు మున్సబు.

"సర్లేవయ్యా! ఊళ్ళో సంబంధమని అడిగాను. వేరే ఏదైనా చూస్తా"మన్నాడు నిరంజన్‌గారు.

తింగరి బుచ్చి అనేది నిర్మలకి సార్థక నామధేయమే.

ఒకసారి అట్ల తద్దికి ఊయ్యాల ఊగుదామని, ఆ ఊళ్ళో ఆడపిల్లలు కట్టుకున్న ఉయ్యాల తాడుని "ఇక ఊగింది చాలు! ఆ తాడిప్పెయ్యండి, దానితో నేను తాడాట ఆడుకుంటాను" అంటూ వాళ్ళ సరదా తీరకుండానే, ఆ ఉయ్యాల తాడును అక్కడినుండి విప్పేసి నిర్మల తాడాట మొదలుపెట్టింది.

మొత్తానికి ఆ పిల్లల్ని పూర్తిగా ఉయ్యాలా ఊగనివ్వకుండా, మధ్యలో తాడాట మొదలుపెట్టిన ఉసురు ఊరికే పోతుందా, తింగరి బుచ్చి కాలు బెణికి, పదిహేను రోజులు మంచమెక్కింది.

ఇంకోసారి పక్కింట్లో తాడాట ఆడుతూ, ఆడుతూ, పెళ్ళికని పోయించుకున్న పాల గంగాళం మీద పడి, ఆ గంగాళం పాలూ నేలపాలు చేసింది.

మరోసారి తాడాట ఆడుతూ, తొంభై ఏళ్ళ అవ్వమీద పడి, ఆ అవ్వచేత 'ఓసి! తింగరి బుచ్చీ' అనిపించుకంది.

ఒకరోజు నిరంజన్‌గారు, మున్సబు గారి దగ్గరకొచ్చి "ఏమయ్యా! మీ అబ్బాయికైతే మా నిర్మల మీద మక్కువ లేదన్నాడు. మీ మేనల్లుడు, అదే పట్నంలో డాక్టరట కదా, ఆ సంబంధం చెప్పకపోయావా!" అన్నాడు.

"వాళ్ళకి ఆస్తులు లేవండి, అంచేత ఆ సంబంధం చెప్పలేదు" అన్నారు మున్సబు.

"ఆస్తులెవరికి కావాలయ్యా! పిల్లాడు డాక్టరు కదా! చాలా బుద్ధిమంతుడని విన్నాను. మనకే యాభై ఎకరాల భూమి వుంది. మన పిల్లని చేసుకుంటే అతనే పెద్ద ఆస్తిపరుడవుతాడు, ఏమంటావు?" అన్నారు నిరంజన్‌గారు.

"అలాయితే సరే నండి" అన్నాడు మున్సబు.

మున్సబుగారి మేనల్లుడితో నిర్మల పెళ్ళి నిశ్చయమైంది.

మున్సబుగారి చుట్టాలంతా "ఓరేయ్ తంబూ! నువ్వు చాలా అదృష్టవంతుడివి రా!" అన్నారు.

పెళ్ళికొడుకుని అంతా తంబూ, తంబూ అంటూంటే, "ఈ తంబూ అనేది ముద్దుపేరా?" అని అడిగారు నిరంజన్‌గారు.

"వాడు చిన్నప్పట్నుంచీ చాలా అదృష్టవంతుడు. పరీక్షల ముందురోజు ఏదైతే చదువుకున్నాడో అవే ప్రశ్నలు పేపర్లో ఆడిగేవారు. అంచేత వాడిని 'తంతే బూర్లు గంప' అని ఏడిపించే వారండి మా వాళ్ళంతా! ఆఖరికి, అదే తం.బూగా మారింది" అన్నారు మున్సబుగారు.

నిర్మలకి చుట్టాలంతా మరీ మరీ చెప్పారు. "నీకు పెళ్లయి పోయింది. ఇంక తాడాట మానెయ్యమని".

అందుకు ఓ చిరునవ్వు మాత్రమే నిర్మల సమాధానం.

అదును చూసుకుని ఏదో సమయంలో తాడాట ఆడేది.

ఒకసారి తన తాడు కనపడకపోతే పెళ్ళికి వచ్చిన చుట్టాల బెడ్డింగు తాడు విప్పేసి, తాడాట మొదలుపెట్టింది.

ఆ తాడు పోగుట్టుకున్న చుట్టాలాయన "తాడాట తాటకి" అని మనస్సులోనే తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకున్నాడు.

తన శోభనం చేయడానికి నిశ్చయించారని తెలుసుకున్న తిం.బు శోభనం అయిపోతే తన కిష్టమైన తాడాట దూరమైపోతుందేమోనన్న బెంగతో ఓ రోజు సాయంకాలం ఎవ్వరికీ తెలీకుండా దగ్గర్లోనే ఉన్న మామిడి తోటలోకి వెళ్ళి తాడాట, తనవితీరా ఆడుతున్న సమయంలో కాలు విపరీతంగా బెణికింది.

లేవలేక, అక్కడే కూర్చుని మూలుగుతూన్న సమయంలో, ఆ తోటకాపరి తోటంతా తిరుగుతూ, తిం.బుని చూసి "ఏమిటి అమ్మాయిగారూ! చీకటి పడుతోంది, ఇంటికి వెళ్ళండి" అన్నాడు.

"కాలు బెణికింది. మన ఇంటికెళ్ళి మా అమ్మగారికి చెప్పి మన కారు పంపమను"

అని వాడికి పురమాయించింది.

తర్వాత కార్లో ఇల్లు చేరింది. ఆ రాత్రికి ఆ కాలు బాగా వాచింది. తిం.బు తల్లి "కార్యం ముందే కాలు బెణకాలా?" అంటూ ఏడ్చింది.

ఆ మర్నాటి నుంచి తం.బూ రోజా తిం.బు కాలికి అయింట్‌మెంట్ రాసేవాడు. మొత్తం మీద శోభనం వీళ్ల పెళ్లయిన పదహారు రోజుల పండుగ లోపులో జరగలేదు.

ఒకరోజు మున్సబు గారింట్లో తం.బూతో "అరేయి నువ్వు చాలా అదృష్టవంతుడివిరా! యాభై ఎకరాల మాగాణీకి యజమానివి అయ్యావు" అన్నారు తం.బూ చుట్టాలు.

"ఏం చేసుకోను ఆ మాగాణీ! నా పెళ్ళాం కాలు వాచి నేనేడుస్తూంటే, మధ్యలో ఈ మాగాణీ గోలొకటి" అని చికాకు పడ్డాడు తం.బూ.

మున్సబుగారు "తం.బూ! ఏం బాధపడకురా! కాలు బెణకటమనేది పెద్ద విషయమేమి కాదు!" అంటూ ధైర్యం చెప్పాడు.

తం.బూ రోజా ఆ పాదం చూసుకుంటూ, "ఈ పాదమే కదా మా శోభనం ఆపిందని" మనస్సులోనే బాధపడేవాడు.

తర్వాత తిం.బు కాలు వాపు తగ్గడం, కాపురానికి వెళ్ళడం జరిగాయి.

కాపరానికి వెళ్ళినా తిం.బు తాడాట మానలేదు.

ఒకరోజు మామగారు చెప్పారు "అమ్మాయీ! ఈ తాడాట మానేసి, పెద్ద మనిషి తరహాగా వుండమని".

"నేనాడుకునే తాడు మీది కాదు! మా పుట్టింటి నుంచి తెచ్చుకున్నది. ఇంకా నాలుగు కొత్త తాళ్ళు కాపరానికి వచ్చినప్పుడు తెచ్చుకున్నాను. నేను తాడాట ఆడుకుంటే మీకెందుకూ?" అంది తిం.బు.

"అయితే తాడాట మానవా?" అన్నారు మామగారు.

నా కాలిలో శక్తి లేకపోయినా, నా కంఠంలో ప్రాణమున్నంత వరకూ ఈ తాడాట మానను. మీకు తెలుసో లేదో కాని మా ఊళ్ళో కొంత మంది నన్ను "తింగరి బుచ్చి" అనీ, "తాడాట తాటకి" అని అనుకుంటారు. చాలా మంది! నాకు తెలియదనుకుంటారు కాని నాకన్నీ తెలుసు" అంది తిం.బు.

"తెలిస్తే నీ ఏడుపు నువ్వేడు. రెండుకాళ్ళు ఒకేసారి బెణికి, మంచాన పడినపుడింకా బాగా తెలుస్తుంది" అనుకున్నారు తిం.బు మామగారు.

అలా నిర్మల తాడాట సాగిపోతూనే ఉంది.

(ఆంధ్రప్రభ దినపత్రిక 19-2-2011)